క్లుప్తంగా

భవనాల అద్దె చెల్లింపులో మంత్రి పొన్నం చొరవ



నర్సంపేట : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రభుత్వం తమ భవనాల అద్దె చెల్లించిందంటూ తెలంగాణ రాష్ట్ర పాఠశాల, కళాశాల బిల్డింగ్స్ అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో భవనాల యజమానులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిసి పూలమొక్క బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు దేవయ్య, దేవేందర్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో ఈనెల 15న తాళాలు వేసి నిరసన తెలిపినట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్పందించి వెంటనే రెండు నెలల అద్దె చెల్లించిందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు గోపాల్‌రెడ్డి, కుమారస్వామి, కృష్ణమూర్తి, సెబ్బారెడ్డి, శ్రీహరి, అమరేందర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు



ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామ శివారులో వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాకాల ఆయకట్టు పరిధిలోని తుంగబంధం కాల్వ చివరి ఆయకట్టు కింద వేలాది ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేపట్టారు. కాగా కొద్ది రోజులుగా కాల్వ నుంచి నీరు అందకపోతుండడంతో నెర్రలు బారి వరి పంటలు ఎండిపోతున్న దుస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులు పంటలకు నీరందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలువురి చేత సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, ఏకాంతంగౌడ్, బాబురావు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినోద్‌కుమార్, రామన్న, లక్ష్మణ్, జాటోతు రవి, వెంకటేశ్, గుగులోతు రవి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



చెన్నారావుపేట : మండలంలోని ఈర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన శనివారం కార్యక్రమం నిర్వహించారు. తండాకు చెందిన ధరంసోతు స్వాతి–రవి దంపతుల ద్వితీయ కుమారుడు యోహాన్ పాల్‌కు అంగన్‌వాడీ టీచర్ మేడి సరోజన ఆధ్వర్యంలో అన్నప్రాసన చేశారు. అలాగే చిన్నారులకు 2వ ఎన్‌హెచ్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పవనకుమారి, ఏఎస్‌ఎం పుష్పలత, ఆశవర్కర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నర్సంపేట : రైతులకు రైతు భరోసా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి రైతుల పాలిట శనిలా దాపురించిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌కు రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించడం దుర్మార్గమన్నారు. గతంలో కేసీఆర్ రైతుబంధు నేరుగా ఖాతాల్లో జమ చేసి రైతులు అప్పుల పాలు కాకుండా చూశాడన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా కోసం నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాల కోరారు.

పరామర్శ

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామ సమీపంలో ట్రాక్టర్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇల్లంద గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సుంకరి శ్రీనివాస్ గాయపడి శ్రీచక్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శనివారం రాత్రి పరామర్శించారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకులు పోశాల వెంకన్న, పత్రి భానుప్రసాద్ తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

రాయపర్తి : ప్రజలు ఆర్థిక అక్షరాస్యత సాధిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎఫ్‌ఎల్‌సీ కౌన్సెలర్ ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని గట్టికల్‌లో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఏపీ గ్రామీణ వికాస బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. 2025 జనవరి 15 వరకు జన సురక్ష పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50 ఏళ్ల వరకు వయస్కులైన వారు ఏటా రూ.436 చెల్లించి చేరితే ఖాతాదారు అకాల మరణం లేదా సహజ మరణం చెందినా బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందుతుందని చెప్పారు. అలాగే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంలో 18 నుంచి 70 ఏళ్ల వరకు వయస్సున్న వ్యక్తులు ఏటా రూ.20 చెల్లించి చేతితో ఖాతాదారు ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం అందుతుందని వివరించారు. అలాగే జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా వెయ్యి రూపాయలు చెల్లిస్తే రూ.20 లక్షల బీమాను ఖాతాదారులు వినియోగించుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ రుణాలను ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు, ఇతర వ్యక్తిగత ఖాతా వివరాలు ఇతరులకు వెల్లడించొద్దని స్పష్టం చేశారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి సుమలత, బ్యాంకు ఉద్యోగులు శైలజ, అంజి, కౌన్సిలర్ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాదన్నపేట అఖిలపక్ష కమిటీ నాయకులు, గ్రామస్తులు

నర్సంపేట : మండలంలోని మాదన్నపేట గ్రామాన్ని స్థానిక మునిసిపాలిటీలో విలీనం చేయొద్దని ఆ గ్రామ అఖిలపక్ష కమిటీ నాయకులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కర్నె సాంబయ్య, దేశిని సుదర్శన్, మొలుగూరి చంద్రమౌళి, దండు రవి మాట్లాడారు. గ్రామీణ వాతావరణాన్ని దెబ్బతీసి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే, కూలీల ఉపాధిని దెబ్బతీసేలా ఉన్న విలీన ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. గ్రామ ప్రజలు ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. మున్సిపాల్టీలో విలీనం చేస్తే పన్నుల భారం పెరిగే ప్రమాదం ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కేశెట్టి సదానదం, కొత్తకొండ రాజమౌళి, పెసరు సామ్రాజ్యం, పోలబోయిన నూతన్‌కుమార్, గంధం రాజుగౌడ్, మల్లేశ్, సత్యనారాయణరాజు, దండు రమేశ్, గిరబోయిన రాజేందర్, అజీజ్‌పాషా, తదితరులున్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని..

పంచాయతీ సిబ్బంది, కారోబార్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కారోబార్లు అంకూస్, రాజయ్య, శ్రీనివాస్ మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలు అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉంటున్నాయని చెప్పారు. ఇకనైనా వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్లు శ్రీనివాస్, యాకూబ్, సుధాకర్, రమేశ్, నర్సయ్య, మహేందర్, శ్రీశైలం, వీరన్న, కోటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



రైతులతో మాట్లాడుతున్న డీఈలు భిక్షపతి, ఆనందం

● 'పొలం బాట'లో డీఈలు భిక్షపతి, ఆనందం

సంగెం : వ్యవసాయ బావుల వద్ద రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పొలం బాట కార్యక్రమం చేపట్టినట్లు ఆ శాఖ రూరల్ డీఈ భిక్షపతి, టెక్నికల్ డీఈ ఆనందం తెలిపారు. మండలంలోని ఆశాలపల్లిలో పలువురు రైతులను శనివారం వారు కలిసి విద్యుత్ పరమైన సమస్యలపై అధ్యయనం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల పని తీరు, ఓవర్ లోడ్, లూజ్ లైన్లు, ఇతర సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈలు భిక్షపతి, ఆనందం మాట్లాడారు. వ్యవసాయ పంపు సెట్లకు కేపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు, లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు, ఇతర ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. రైతులు సొంతంగా మరమ్మతులు చేసి ప్రమాదాల బారిన పడవద్దని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈ నర్సింహారావు, ఏఈలు మధుసూదన్, అశ్విన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావికి రక్షణ గోడ నిర్మాణం



సాక్షి ఎఫెక్ట్..

సంగెం : సంగెం–గవిచర్ల దారిలో బీటీ రోడ్డులోని సమస్యను 'బాబోయ్.. రోడ్డు పక్కనే బావి' శీర్షికతో కళ్లకు కట్టేలా ఈనెల 11న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పీఆర్ ఏఈ అభిరామ్ స్పందించారు. ప్రమాద తీవ్రతను గుర్తించిన ఆయన శనివారం సదరు బీటీ రోడ్డు అంచున ఉన్న వ్యవసాయ బావికి రక్షణ గోడ నిర్మింపజేశారు. అధికారులను అప్రమత్తం చేసి రక్షణ గోడ నిర్మించేలా కథనం ప్రచురించిన 'సాక్షి'కి రైతులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



భిక్షాటన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నర్సంపేట : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఉన్నత చదువులకు దూరం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు రూ.7,500 కోట్ల మేరకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం తాత్సారం చేస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రెండేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు పాఠశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు చదువు మానేసి ఇంటి వద్దే ఉంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యుడు రాకం రాకేశ్, ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ తిప్పారపు గణేశ్, నాయకులు అఖిల్, శ్రీనివాస్, చరణ్, సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



మానవహారంలో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

నెక్కొండ : మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని శ్రీధరణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు శోభారాణి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులతో శనివారం నిర్వహించిన ×వాక్ ఫర్ ఫ్రీడమ్–నిశ్శబ్ద నడక× ర్యాలీలో ఆమె అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థి దశలోనే సమాజంలో నెలకొన్న మానవ అక్రమ రవాణా, ఇతర సమస్యలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతులు కావాలని సూచించారు. తద్వారా సమాజంలో మానవ అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తొలుత మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగారావు, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



వికాస్‌గౌడ్



ప్రమీల

చెన్నారావుపేట : మండలంలో పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాల్‌నాయక్‌తండా కార్యదర్శి గొడిశాల వికాస్‌గౌడ్, ఉపాధ్యక్షురాలిగా శంకరంతండా కార్యదర్శి గడ్డ ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా పత్తినాయక్‌తండా కార్యదర్శి బాదావత్ నిట్టు, కోశాధికారిగా పాపయ్యపేట కార్యదర్శి కత్తెరపల్లి రాజు, గౌరవ అధ్యక్షుడుగా అక్కల్‌చెడ కార్యదర్శి తిప్పని చేరాలు ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ..



ఖానాపురం : మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీని జిల్లా నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంద్రాతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బాషెట్టి అశోక్, గౌరవ అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా తూడి కోటేశ్వర్‌రావు, కార్యదర్శిగా మధు, సహాయ కార్యదర్శిగా శోభన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. బీసీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, అశోక్, శ్యామ్, క్రాంతి, రాజు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేశ్

పర్వతగిరి : విద్యార్థులకు విద్య, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం, తదితర ప్రయోజనాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం, విద్యాశాఖ కార్యాచరణ చేపడుతోందని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేశ్ బాబు తెలిపారు. ఆ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. విద్యార్థులందరికీ ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్) ఐడీ కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్య, సంబంధిత కార్యకలాపాల ప్రయోజనాలు, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యాసంస్థలకు, ఉద్యోగ నియామక సంస్థలకు ఐడీ కార్డు ఉపకరించనుందని వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా కార్డు పొందేలా తల్లిదండ్రులు అంగీకారం తెలపాలని కోరారు.

స్కూల్ విద్యార్థులకు టీషర్ట్స్ పంపిణీ



నర్సంపేట రూరల్ : విద్యార్థులతో కవితారెడ్డి



పర్వతగిరి : విద్యార్థులతో పద్మావతి దంపతులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్ విద్యార్థులకు జేడీ ఫౌండేషన్, హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిళి కవితారెడ్డి శనివారం టీషర్ట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫౌండేషన్ బాసటగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు ప్రయోజకులై సమాజానికి తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగ్యా, ఉపాధ్యాయులు సురేశ్, భిక్షపతి, నళిని, కూచన శ్రీనివాస్, వీరన్న, కృష్ణమూర్తి, రామసాగర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల బహూకరణ

పర్వతగిరి : మండలంలోని కొంకపాక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పేరాల పద్మావతి సుధాకర్ దంపతులు శనివారం టై, బెల్ట్, బ్యాడ్జి, వాటర్ బాటిల్స్, నోట్ బుక్స్, చైర్స్ బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయపు లింగారెడ్డి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అవకాశం ఉన్న ప్రజలు పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మల్లికార్జున్, రాజ్‌కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రవి (ఫైల్)

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన మల్యాల రవి (42) హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. తొర్రూరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తున్న రవి ఈనెల 12న మండల కేంద్రంలో ప్రమాదానికి గురయ్యాడు. అతన్ని 108 వాహనంలో తొలుత వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి, తదనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రవి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

వర్ధన్నపేట : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని భవానీకుంట తండా క్రాస్ వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పక్కనే ఉన్న పొలాల్లో పడిపోగా వాహనంపై ఉన్న భీమా గాయాల పాలయ్యాడు. భీమాను స్థానికులు వర్ధన్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

గుణాత్మక విద్య అందించాలి

నల్లబెల్లి : విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్ కోరారు. మండలంలోని కొండాపూర్, రుద్రగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో కొత్తగా ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి శనివారం ఆయన పీఆర్‌టీయూ సభ్యత్వం అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహ అధ్యక్షుడు అన్న మహేందర్, రాష్ట్ర సహ అధ్యక్షులు చంద్రశేఖర్, తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట రాంనర్సయ్య పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని కార్ల్ మార్క్స్ కాలనీకి చెందిన ఎంసీపీఐ(యూ) సభ్యురాలు అప్సర మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న పుష్ప, బైరబోయిన నర్సయ్య, పద్మ, విజయ, శారద, అనిల్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లిలో రేగుల వీరమల్లు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపెల్లి యాదగిరి, రాజేంద్రప్రసాద్, కమ్మగోని సాంబమూర్తి, సోల్తి రాజబాబు, దొమ్మటి శంకరి, కారోబార్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి

రాయపర్తి : జనగామ జిల్లా పాలకుర్తిలో గిరిజన సామాజికవర్గానికి చెందిన లకావత్ శ్రీను ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలిన తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సురేంద్ర రాథోడ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని మేకల తండాకు చెందిన లాకావత్ శ్రీను పోలీస్‌స్టేషన్‌లోనే ఆత్మహత్యకు పాల్పడాల్సిన దుస్థితి ఏర్పడడం బాధాకరమని పేర్కొన్నారు. శ్రీను పోలీసులను ఆశ్రయించగా సీఐ, ఎస్సై సరైన రీతిలో స్పందించకుండా మోసపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి శ్రీను మృతికి కారకులైన సీఐ, ఎస్సై, ఇతరులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

నర్సంపేట రూరల్ : 2025 మార్చిలో జరగనున్న నల్గొండ, వరంగల్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మండలంలోని ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని ఎంఈఓ కొర్ర సారయ్య కోరారు. నర్సంపేటలోని జెడ్పీ బాలుర సెకండరీ స్కూల్‌లో ఆన్‌లైన్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి నమోదు పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల, అన్ని గురుకుల పాఠశాలలు, యూనివర్సిటీల్లో పని చేస్తున్న అధ్యాపకులు గడచిన ఆరేళ్లలో మూడు సంవత్సరాలు పని చేసిన అర్హత కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన గుళ్లపెల్లి కుమారస్వామి–మమత దంపతుల కుమారుడు అఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామంలోని ఉద్యోగ, వ్యాపార వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు పులి దేవేందర్, గుళ్లపల్లి స్వామిల తోపాటు బాధ్యులు, గ్రామస్తుల సహకారంతో సేకరించిన రూ.62,083ను పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన బాండ్‌ను ఆర్థికసాయంగా బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని దేవేందర్, స్వామి పరామర్శించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వ్యాపారవేత్తలు గుళ్లపెల్లి రమేశ్, పెద్ద వెంకన్న, మాడుగుల కుమార్, సాంబరెడ్డి, గుళ్లపెల్లి రాజారామ్, స్వామి, వెంకన్న, జైపాల్, రాజు, పరికి మధూకర్, సతీశ్, నగేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్రపల్లిలో..

నెక్కొండ : మండలంలోని గుండ్రపల్లికి చెందిన సూత్రపు మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి పదో తరగతి నాటి స్నేహితులు రూ.55 వేలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బాండ్‌ను అతడి కుమార్తెలకు శనివారం అందజేశారు. తొలుత మహేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మహేశ్ స్నేహితులు మహ్మద్ సలీమ్ పాషా, రామారపు రాము, కనకం రాజేశ్, శ్వేత, రాజు, రాపాక విజయ్, రమేశ్, రవికుమార్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్స్, ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండలంలోని పెరికేడులో పెయింటర్ సైదులు తల్లి మృతి చెందగా బాధిత కుటుంబానికి రవివర్మ పెయింటర్స్, ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్, ప్రధాన కార్యదర్శి కోట భిక్షపతి, నాయకులు చెవ్వ కుమార్, బందు రాజు, ఐత కరుణాకర్, సురేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నర్సంపేట : దళితులపై దాడికి పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి ప్రణయ్‌దీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి ఆయన ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రణయ్‌దీప్ మాట్లాడారు. కన్నారావుపేటకు చెందిన ఎస్సీలపై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం, పోలీసులు వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తడుగుల విజయ్, రమేశ్, నరేశ్, ప్రతాప్, సునీల్, రవి, సురేశ్, నవీన్ పాల్గొన్నారు.